రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు


పరిగి: వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ


గుడిబండ: పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


చిలమత్తూరు: వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

- ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకరనారాయణ, డాక్టర్ తిప్పేస్వామి

పరిగి: అవినీతి,అక్రమాలకు తావులేకుండా, రాజకీయాలకతీతంగా ప్రజలకు చేరువ చేయడానికే వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ హాజరయ్యారు. సమాజంలో వలంటీర్లకు గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సివచ్చేదన్నారు. సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థతో మానవసంబంధాలను దగ్గర చేశారని, అందుకే ఆయన ప్రజల గుండెల్లో చెదిరిపోని స్థానం సంపాదించుకున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థను తప్పుబట్టిన చంద్రబాబే నేడు వలంటీర్లను తొలగించమని, అధికారంలోకి వస్తే కొనసాగిస్తామని నమ్మించడానికి సిద్ధమయ్యారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టడమే కాకుండా, ఇవ్వని వందలాది పథకాలను అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలబడుదామని ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ కోరారు. దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు సీఎం జగనన్న కృషి చేస్తున్నారన్నారు.

పురస్కారాలు అందజేత ..

సేవావజ్ర పురస్కారాలను పొందిన శైలజ, చెన్నకృష్ణ సిరి, సేవా రత్న పురస్కారాలు పొందిన నరేష్, కె.శైలజ, మల్లేష్, జయశ్రీ, తేజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, ఎంపీపీ సవిత, సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, లింగమ్మ, వైస్ సర్పంచ్ విష్ణు, నాయకులు నరసింహారెడ్డి, సురేష్‌రెడ్డి, శివశంకర్, ఆల్తాఫ్, రవూఫ్, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మాజీ కన్వీనర్ జయరాం, కోఆప్షన్ మెంబర్ సలీం, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలనకు సారథులు వలంటీర్లేనని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అందిస్తూ నిత్యం ప్రజలతో మమేకమైన వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. ముఖ్యమంత్రి తలపెట్టిన సేదరిక నిర్మూలన అనే యజ్ఞంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగాగా సీఎం వైఎస్ జగన్ గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. ప్రతి నెలా 1న ఉదయం 6 గంటలకే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించడంతో అవి అర్హులకు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. మండలంలోని 233 మంది వలంటీర్లకు సేవామిత్ర, ఐదుగురికి సేవారత్న, ఒకరికి సేవావజ్ర అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీడీఓ రామారావు, ఏఓ మల్లికార్జున, వైస్ ఎంపీపీ రత్నమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, మండల సచివాలయ కన్వీనర్ కె.శివకుమార్, ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, నాయకులు పరమేష్, నాగేష్, బోరప్ప తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


లేపాక్షి: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

లేపాక్షి/చిలమత్తూరు: వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం ఉదయం లేపాక్షిలోని ఆర్‌జే హెచ్ ఫంక్షన్‌లో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్లతో పాటు సచివాలయాల వ్యవస్థను రద్దు చేస్తారని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. గత టీడీపీ పాలనలో ఫింఛన్, రేషన్‌కార్డు, ఇంటి స్థలం లాంటివి లబ్ది పొందాలన్నా టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి లంచాలు ఇవ్వాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఎవరి సిఫార్సులు లేకుండానే వలంటీర్ల ద్వారా పారదర్శకంగా ఇంటికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ వివరించారు. ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతు మండల వ్యాప్తంగా 230 మంది వలంటీర్లు పనిచేస్తున్నారని, అందులో ఐదుగురికి సేవా రత్న అవార్డులు, మిగిలిన 225 మందికి సేవా మిత్ర అవార్డులు అందజేశామన్నారు. అనంతరం వలంటీర్లకు సేవా పతకాలు అందజేసి శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, సర్పంచ్‌లు ఆదినారాయణ, మంజునాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బోర్ల అంజినరెడ్డి, ప్రభాకర్‌రావు, శంకరప్ప, తిప్పన్న, ఆనంద్, శ్రీరామిరెడ్డి,ప్రభాకర్‌తో పాటు పలువురు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ చిలమత్తూరు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను శాలువాతో సత్కరించి అభినందించారు..అనంతరం ఆయన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం గర్భిణులకు అందించే పౌష్టికాహార పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు అనూష, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు తిరుమలేష్, మురళీ మోహన్, సంధ్య, వైస్ ఎంపీపీ బయప్ప, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ, నాయకులు నాగరాజు యాదవ్, నయిముల్లా, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ గోల్‌మాల్‌పై మళ్లీ విచారణ

మడకశిర: మడకశిర పంచాయతీరాజ్ శాఖలో జరిగిన సిమెంట్ గోల్‌మాల్‌పై శుక్రవారం విజిలెన్స్ విచారణ మళ్లీ ప్రారంభమైంది. రెండో విడతలో అగళి, రొళ్ల మండలాల్లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. తొలి విడతలో అమరాపురం, గుడిబండ మండలాల్లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. అగళి, రొళ్ల మండలాల్లో విజిలెన్స్ అధికారులు పీఆర్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ముఖ్యంగా 2019 నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో దాదాపు 800 వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. ఈపనుల కోసం ప్రభుత్వం దాదాపు 2 లక్షల బస్తాలకు పైగా సిమెంట్ సరఫరా చేసింది. దాదాపు 80వేల బస్తాల సిమెంట్ దారి మళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలిన విషయం తెలిసిందే. ఇందుకు బాధ్యులైన డీఈ, ముగ్గురు ఏఈలపై ప్రభుత్వం శాఖపరమైన చర్యలు తీసుకుని విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈనేపథ్యంలో విజిలెన్స్ అధికారులు అన్ని మండలాల్లో పర్యటించి లోతుగా విచారణ చేస్తున్నారు. రొళ్ల, అగళి మండలాల్లో విచారణ పూర్తి కాగానే మడకశిర మండలంలో ప్రారంభించనున్నట్లు తెలిసింది.

ప్రకాశం జిల్లా జడ్జికి సన్మానం


న్యాయమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రకాశం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సోమశేఖర్‌ను మానవహక్కుల సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. రొద్దం మండలానికి చెందిన సోమశేఖర్ కొన్నేళ్ల పాటు పెనుకొండలో న్యాయవాదిగా పని చేసి, అనంతరం జడ్జిగా నియమితులయ్యారు. పెనుకొండ మీదుగా రొద్దం వెళుతున్న న్యాయమూర్తిని మానవహక్కుల కమిటీ నాయకులు రవూఫ్, సమీవుల్లా, ఇస్మాయిల్, సిరాజుద్దీన్, చలపతి, శేషయ్య తదితరులు కలిశారు. అనంతరం జడ్జిని సన్మానించారు.

క్లుప్తంగా

పకడ్బందీగా వేరుశనగ పంపిణీ


వేరుశనగను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ

లేపాక్షి: విత్తన వేరుశనగ పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ ఆదేశించారు. మండలంలోని లేపాక్షి-2, చోళసముద్రం రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉన్న విత్తన వేరుశనగను శుక్రవారం ఆయన పరిశీలించారు. వేరుశనగ పంపిణీ కార్యక్రమం పగడ్బందీగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఎంఐపీ ద్వారా సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన రైతులు ఆర్‌బీకేలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారి శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

వేరుశనగ విత్తన కాయల పరిశీలన

మడకశిర: పట్టణంలోని వ్యవసాయ గోదాములో నిల్వ ఉంచిన వేరుశనగ విత్తన కాయలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి కృష్ణానాయక్ పరిశీలించారు. ఇంత వరకు ఎన్ని బస్తాల విత్తనకాయలు వచ్చిందో అర్బన్ ఆర్బీకే ఇన్‌చార్జ్ రాజేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తన కాయలను రైతులకు అందించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


పనుల నిర్వహణపై చర్చిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: హరేసముద్రం పంచాయతీలోని ఉపార్లపల్లిలో రెండో విడత నాడు-నేడు కింద ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను శుక్రవారం డీఎల్‌పీఓ శివనాగేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా పనుల నిర్వహణపై అధికారులతో చర్చించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. పంచాయతీలో వివిధ పథకాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అదాయ వనరులు పెంపొందించుకొని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

లేపాక్షి: మండలంలోని కోడిపల్లిలో సర్పంచ్ మంజునాథ్ అధ్యక్షతన శుక్రవారం ఉదయం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. హిందూపురం పట్టణంలోని డాల్ఫిన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్లాంట్ ఏర్పాటు చేయగా పంచాయతీ అధికారులు బోరుబావి నుంచి పైప్‌ల ద్వారా నీరు సరఫరా చేసారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగభూషణ, తిప్పన్న, శంకరప్ప, టస్ట్ చైర్మన్ ముస్తఫా పాల్గొన్నారు.

ఉపాధి పనులపై కూలీలకు అవగాహన


రొద్దం పెద్ద చెరువు వద్ద కూలీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని పెద్దకోడిపల్లి, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనుల వద్ద కూలీలకు పనులపై అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం రోజ్‌గార్ దివస్ సందర్భంగా కూలీలకు పనులపై అవగాహన కల్పించినట్లు ఏపీఓ జగదీశ్ తెలిపారు. పనులు నాణ్యతగా, కొలతల ప్రకారం చేస్తే కూలీలకు బిల్లులు రూ.272 వస్తుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూలీలు అధికంగా రావాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నరసయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు షామీర్‌బాషా, మధు తదితులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే గ్రీన్, ఎల్లో బెల్టుల ప్రతిభావంతులతో మాస్టర్లు రియాజ్‌బాషా, జనార్దన్‌రెడ్డి, శ్రీధర్

పరిగి: ఆపద సమయాల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగించి, ఆత్మరక్షణకు కరాటే ఎంతోగానో దోహదపడుతుందని వక్తలు తెలిపారు. కొడిగెనహళ్లిలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి, శిక్షణ అనంతరం వివిధ కేటగిరీల ఆధారంగా బెల్టులను ప్రదానం చేశారు. ఎక్జామినర్ చీఫ్ మాస్టర్ రియాజ్‌బాషా, ఆర్గనైజింగ్ కరాటే మాస్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం వల్ల మానసికోల్లాసం, శారీరక దృఢత్వంతోపాటు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. గ్రీన్ బెల్ట్ కేటగిరీలో రుషికేష్, జాగృతి, భువనేశ్వరి, షిలో, సంకీర్తన నిలిచారు. గమ్య విహారీ, తన్వీతరెడ్డి, హర్ష అనే విద్యార్థులు ఎల్లో బెల్టులు సాధించారు. ప్రతిభావంతులకు ముఖ్య అతిథి శ్రీధర్ చేతుల మీదుగా బెల్టుల ప్రధానంతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంకరనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇంటి పట్టా మంజూరు చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందించాలని ఎంఈఓ లక్ష్మీదేవిని ఆదేశించారు.ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉన్న 5,558 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందించనున్నామన్నారు. ప్రభుత్వ నిర్మాణ పనుల్లో జాప్యం వద్దని, సకాలంలోనే బిల్లులు వస్తాయన్నారు. రైతులకు సకాలంలో వేరుశనగ విత్తనాలతో పాటూ ఎరువులను పంపిణీ చేయాలన్నారు. విత్తన వేరుశనగ పంపిణీకి రిజిస్ట్రేషన్ జరుగుతోందని ఏఓ విజయభారతి తెలిపారు. ఈనెల 30న ప్రభుత్వం మండలంలోని 7,785 మంది రైతులకు రైతు భరోసా పథకం కింద డబ్బు జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు, వైస్ ఎంపీపీ శకుంతలమ్మ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జెడ్పీటీసీ శ్రీరామప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, కోఆప్షన్ మెంబర్ సలీం, ట్రాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్, ఏపీఎం చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన, పశుసంవర్ధక అధికారి సోమశేఖర్, వెలుగు సీసీ లక్ష్మణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రికార్డులు పకడ్బందీగా నిర్వహించండి

అమరాపురం: రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌డీఓ శివారెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన హేమావతి సచివాలయంలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆధార్ నమోదుపై సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రతపై వైద్యులను అడిగారు. ప్రహరీ లేకపోవడంతో అపరిశుభ్రత నెలకొంటోందని, ప్రహరీ నిర్మించేలా చూడాలని గ్రామస్తులు కోరారు. అనంతరం అమరాపురం గ్రామ సచివాలయాలను పరిశీలించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టిక, సచివాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రజలకు అందిస్తున్న సేవల పుస్తకాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ మునిస్వామి, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయండి

పెనుకొండ: వైఎస్సార్ ఆరోగ్య బీమాలో సచివాలయ సిబ్బంది తప్పులు సరిదిద్ది బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలు శాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. దీంతో ఆ శాఖల సమస్యలపై చర్చ జరగలేదు. అనంతరం జరిగిన సమావేశంలో లేబర్ ఆఫీసర్ మాట్లాడుతూ కుటుంబ పెద్ద చనిపోతే ప్రభుత్వం రూ.5లక్షల బీమా పరిహారం అందిస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా నమోదు చేయకపోవడంతో బాధిత కుటుంబాలకు పరిహారం అందలేదన్నారు. పెనుకొండ మండలంలో బాధ్యతతో పని చేసి గుర్తింపు పొందాలన్నారు. గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీనాథ్ మాట్లాడుతూ నీటి వసతి ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఐసీడీఎస్, అగ్రికల్చర్, వ్యవసాయ శాఖ, ఇంజనీరింగ్ తదితర శాఖలపై అధికారులు వివరించారు. వైస్ ఎంపీపీ రామాంజనేయులు, ఎంపీడీఓ శివశంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. స్తంభించిన ట్రాఫిక్

పెనుకొండ: పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై వైశాలి హోటల్ సమీపంలో కియాకు చెందిన ఓ లారీ బోల్తా పడింది.దీంతో గంట పాటు 44వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. కేఏల్ 01-ఏఎఫ్ 1235 లారీ కియా కార్ల కంపెనీకి ఓ ప్రైవేట్ కంపెనీ నుంచి సామగ్రి రవాణా చేస్తోంది. పాలసముద్రం వైపు నుంచి వచ్చిన లారీ రోడ్డు పక్కన బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. పెనుకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో లారీని తొలగించారు.

ఆలయంలో చోరీ

పరిగి: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ పన్నేడమ్మ (సప్తమాతృక) అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. వరిగి చెరువు కట్టకు ఆనుకొని మడకశిర ప్రధాన రహదారి పక్కన ఉన్న పన్నేడమ్మ ఆలయంలో గత గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయానికి ఉన్న తాళాలు ధ్వంసం చేసి, లోపలికి ప్రవేశించారు. హుండీ పగలగొట్టి, నగదు ఎత్తుకెళ్లారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న వైకేపీ పీడీ

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం దొమ్మరహట్టి గ్రామ సమీపాన ఉనన అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి అందిన పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్య కానుక కిట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే 50 శాతం జగనన్న విద్య కానుక కిట్లను పాఠశాలలకు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు విద్య కానుక కిట్లను సరఫరా చేసిందన్నారు. ఎంఈఓ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 1.55 లక్షల రికవరీకి ఆదేశాలు

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఉపాధి హామి పథకం కింద 17వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రజావేదికలో రూ.1.55 లక్షలు అక్రమాలు జరిగాయని, ఈ మొత్తం కవరీకి ఆదేశించినట్టు జిల్లా విజిలెన్సు ఆఫీసర్ రమణారెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు జరిగిన వివిధ ఉపాధి పనులు, అనుబంధ శాఖలకు సంబంధించిన పనుల తనిఖీ నిర్వహించామన్నారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకూ చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. ఆయా పనులకు రూ. 5 కోట్లు నిధులు మంజూరు కాగా అందులో రూ.4.49 కోట్లు ఖర్చు చేవారని, రూ.1,55,135 రికవరీ చేయాలని ఆదేశించారు. అత్యధికంగా శిరివరం పంచాయితీలో రూ. 70949, అత్యల్పంగా మానేపల్లి పంచాయతీలో రూ.1000 రికవరీ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజినేయులు, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మడకశిర(అగళి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ రేణుక అధికారులకు సూచించారు. శుక్రవారం అగళి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మండలానికి 236 ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో అడిగిన కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పిస్తున్నామని ఏపీఓ శివన్న తెలిపారు. ప్రస్తుతం మండలంలో రోజూ 2,100 మంది కూలీలు పని చేస్తున్నారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివానంద మాట్లాడుతూ పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, వైస్ ఎంపీపీలు హేమంతరాజు, విమల, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఊర్లనే నిర్మిస్తున్న సీఎం జగన్

- ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ


మోదాలో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

పరిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలానికి ఒకటి రెండు ఇళ్లు కాదు.. ఊర్లనే నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని మోదాలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లోని ఉమాదేవి, అనిల్ దంపతుల ఇంటి స్థలంలో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇళ్లులేని వారికి అర్హత ఆధారంగా సచివాలయాల్లోనే పట్టా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సొంత స్థలం కలిగిన వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చి, నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, ఎంపీటీసీలు అంజి, నారాయణరెడ్డి, హనుమంతు, ఎంపీడీఓ సరస్వతి, హౌసింగ్ ఏఈ సునిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, నాయకులు నరసింహారెడ్డి, మోహన్, మంజు, నాగరాజు, నారాయణస్వామి, ఆనంద్, చంద్రమౌళి, గోపాల్, మాజీ ఎంపీటీసీ అంజి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

శాసనకోటలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు జయచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ శాసనకోటకు వెళ్లి జయచంద్రారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పైడేటిలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ రామకృష్ణను పరామర్శించారు.

'పురం' వాసికి కల్లూరు సుబ్బారావు సాహిత్య అవార్డు


రచయిత కల్లూరు రాఘవేంద్రరావును పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన రచయిత, తెలుగు సాహిత్యవేత్త, శ్రీకృష్ణదేవరాయల గ్రంథమాల మేనేజింగ్ ఎడిటర్ కల్లూరు రాఘవేంద్రరావుకు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు సాహిత్య అవార్డు దక్కడంపై స్థానిక కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు, ఉపాధ్యాయులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 25న అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో కల్లూరు రాఘవేంద్రరావు సాహిత్య అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కవి, రచయిత సడ్లపల్లె చిదంబర్‌రెడ్డి, ఉమర్ ఫారూక్, ప్రాచీన తెలుగు భాషా ఆచార్యులు నాగశేషు, ఏటిగడ్డ అశ్వర్థ నారాయణ, జాబిలి చాంద్ బాషా, శోంటి జయప్రకాశ్, సుదర్శన్ మాట్లాడుతూ పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జీవితచరిత్రను కల్లూరు రాఘవేంద్రరావు రచించారన్నారు. ఇలాంటి జీవిత చరిత్రలు మరిన్ని రావాలన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఉద్యమ రూపంలో చైతన్యం తీసుకురావాలన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

హిందూపురం: ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యసలహాలు పాటించాలని డాక్టర్ చక్రతేజారెడ్డి సూచించారు. మండలంలోని తూమకుంట పారిశ్రామిక వాడ సమీపంలోని వడ్డిపల్లిలో కుశాల్ హెల్త్‌కేర్ సహకారంతో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అశోక్, మలేశ్వరి, లక్ష్మమ్మ, రాధ, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టి ఆస్పత్రి ఇన్‌చార్జ్ స్వరూపకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ జిల్లా పరిధిలో సుమారు 25 వేల మంది కార్మికులు ఐపీ మెంబర్స్‌గా ఉన్నారని, కానీ ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, మందుల కొరత తీవ్రంగా ఉందన్నారు. స్థానికంగా వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని, వైద్యసిబ్బందిని కార్మికులకు అనుకూలంగా నియమించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, అనుబంధ సంఘాల యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సందీష్, నాగభూషణ్, రామకృష్ణ, మారుతీరెడ్డి, మల్లికార్జున, జగదీష్, మంజునాథ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి వితరణ

లేపాక్షి: లేపాక్షి ఆలయానికి సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రానికి ఆలయంలో పనిచేసే కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది రాముతో పాటు గైడ్ విరుపన్న, ఆదిలక్ష్మి, నరేష్, అంజినప్ప శుక్రవారం ఉదయం రూ. 25 వేలు విలువ చేసే 50 కుర్చీలు వితరణ చేశారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.